ఆర్బీకేలు రైతు నేస్తాలు



గుండెపూడి ఆర్బీకేలో కియోస్క్ ద్వారా రైతులకు సలహాలిస్తున్న వ్యవసాయ సహాయకురాలు



అల్లవరం రైతు భరోసా కేంద్రం

- రైతు భరోసా కేంద్రాలకు ప్రతి గ్రామంలో పక్కా భవనాలు
- విత్తనం నుంచి విక్రయం వరకూ సకల సేవలు

అల్లవరం: దండగమారి వ్యవసాయం అన్నది గత పాలకుల మాట.. లాభసాటి వ్యవసాయమన్నది నేటి పాలకుల మాట.. ప్రజాసంకల్ప యాత్రలో రైతుల కష్టాలను కళ్లారా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల కన్నీళ్లు తుడిచి వారికి వ్యవసాయంపై భరోసా కల్పించారు. రైతు బాగుంటేనే ఈ దేశం అభివృద్ధిని సాధిస్తుందని నమ్మిన వ్యక్తి

అమలాపురం నియోజవర్గంలో రైతు భరోసా కేంద్రాలు..
మొత్తం రైతు భరోసా కేంద్రాలు - 62
నిర్మాణానికి కేటాయించిన నిధులు - 13.51 కోట్లు
ఇప్పటివరకూ పూర్తయిన భవనాలు - 21
వివిధ దశల్లో ఉన్నవి - 41

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేసి వ్యవసాయ విప్లవాన్ని సృష్టించారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు వ్యవసాయ సహాయకుల్ని అందుబాటులో ఉంచారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పండించిన పంటకు గిట్టుబాటు ధరలను పక్కాగా అమలుచేస్తున్నారు.

ఆర్బీకేలతో చేరువైన సేవలు

గతంలో ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలో ఉండే వ్యవసాయ శాఖ కార్యాలయానికి రైతులు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ ఆర్బీకేలు ఏర్పాటు చేయడంతో రైతులు తమ సొంత గ్రామంలోనే అన్ని సేవలు పొందుతున్నారు.

ఆర్బీకేలతో ఎంతో మేలు



"ఆర్బీకేల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. అమలాపురం నియోజకవర్గంలోని అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల్లో నిర్మాణం పూర్తి చేసిన ఆర్బీకేలను ఇప్పటికే ప్రారంభించాం. మార్చి నాటికి మిగిలినవి పూర్తి చేస్తాం. మరో మూడు ఆర్బీకేల్లో మాత్రం పనులు ప్రారంభించాల్సి ఉంది."

– ఎం.షంషీ, ఏడీ, అమలాపురం

ముఖ్యంగా భూసార పరీక్షలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరంగా ఉంది. ముఖ్యంగా కియోస్క్‌ల ద్వారా తమకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై 48 గంటల్లోనే పొందుతున్నారు. అంతేకాకుండా సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లతో పాటు ట్రాక్టర్లను కూడా అందజేస్తున్నారు. ఈ–క్రాప్ బుకింగ్ వల్ల ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం పొందే అవకాశమేర్పడుతుంది. ఈ–క్రాప్ సర్టిఫికెట్ ద్వారా బ్యాంకులు రైతులకు పంట రుణాలను అందజేస్తున్నాయి. ఆర్బీకేల ద్వారా సొంత గ్రామంలోనే రైతులకు కావాల్సిన అన్ని రకాల సేవలు అందుతున్నాయి. ఆర్బీకేల్లో రైతు భరోసా, పీఎం కిసాన్, రైతులకు సున్నా వడ్డీ రాయితీ, వైఎస్సార్ యంత్ర సేవా పథకం, ఇన్‌పుట్ సబ్సిడీ, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సబ్సిడీపై వరి విత్తనాలు, అపరాలు, నాణ్యమైన ఎరువులు అందజేత తదితర సేవలను సైతం అందిస్తున్నారు.

మాట తప్పని నేత సీఎం జగన్



లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- తాళ్లరేవులో నూతన పింఛన్ల పంపిణీ

తాళ్లరేవు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పని మడమ తిప్పని నేత అని టీటీడీ పాలక మండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పొన్నాడ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచి మాట నిలబెట్టుకున్నారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలుచేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచారన్నారు. ముఖ్యంగా పేదవాడి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచారని, ఇది దేశంలోనే ప్రథమమన్నారు. ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. అనంతరం నూతనంగా మంజూరైన 206 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, వైస్ ఎంపీపీలు ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, ఎంపీడీఓ ఎం.అనుపమ, స్థానిక ఎంపీటీసీ సభ్యులు నందికోళ్ల శ్రీదేవి, రత్సముత్యాలు, అంకాడి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కొత్త పెన్షన్ అందిస్తున్న సర్పంచ్ సాధనాల వెంకటరావు

అల్లవరం: మండలంలోని దేవగుప్తంలో సర్పంచ్ సాధనాల వెంకటరావు, బోడసకుర్రులో రొక్కాల విజయలక్ష్మిల అధ్యక్షతన మంగళవారం నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుడుపూడి సూర్యప్రకాష్, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, కాశి బాలయోగి, సాధనాల శ్రీను, అడపా దత్తుడు, ఓలేటి పరమేష్, చింతం శ్రీను కార్యదర్శి దుర్గా శ్రీను, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజా, సత్యనారాయణ పాల్గొన్నారు.



కాట్రేనికోనలో లబ్ధిదారులకు పెన్షన్ అందజేస్తున్న నాయకులు

కాట్రేనికోన: కాట్రేనికోనలో కొత్తగా మంజూరైన 145 పింఛన్లను సర్పంచి గంటి వెంకట సుధాకర్, వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావులు లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కాశిహనుమంతరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు సంసాని నాగేశ్వరరావు, పాలెపు ధర్మారావు, నల్లా బేబి జానకి, మోకా చంద్ర నాగరత్నం, అక్కల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.ఘన సత్యనారాయణ, కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మంచిగంటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక వెత్సావారి అగ్రహారంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ నాయుడు, ప్రధానోపాధ్యాయుడు బీఆర్ కామేశ్వరరావు, కౌన్సిలర్ పిండి అమరావతి ట్యాబ్‌లతో పాటు స్టడీ మెటీరియల్ పుస్తకాలు అందజేశారు.

వాలీబాల్ పోటీల పోస్టర్ల ఆవిష్కరణ



వాలీబాల్ పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సునీత, శివన్నారాయణ తదితరులు

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరంలో 13వ సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ జిల్లా స్థాయి మెగా వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తెలిపారు. మంగళవారం పోటీల నిర్వహణకు సంబంధించిన పోస్టర్లను ఎంపీపీ రాయుడు సునీత తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాయుడు సునీత మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా యువత చెడుదారుల వైపు వెళ్లకుండా పలు రకాల ఆటల పోటీలను నిర్వహిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటుతున్న శివన్నారాయణను అభినందించారు. శివన్నారాయణ మాట్లాడుతూ 11 నుంచి 13 వరకూ వాలీబాల్ పోటీలు, 14న ముగ్గుల పోటీలు, అదే రోజు సాయంత్రం ఆర్కెస్ట్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్, రెడ్డి రెడ్డిబాబు, కాలా వెంకటరమణ, కొప్పిశెట్టి వెంకట్, యడ్ల కుటుంబరావు, వెంటపల్లి వెంకటేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్లు మల్లేశ్వరరావు, గురుశంకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశం జరపాలి



నిరసన చేస్తున్న సిబ్బందికి మద్ధతు తెలిపిన అఖిలపక్ష నేతలు

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 42 మంది సిబ్బందికి న్యాయం జరగాలంటే తప్పనిసరిగా అఖిలపక్ష సమావేశం జరపాలని తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక జీజీహెచ్ వద్ద ఏడు రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న ఆందోళనకారులకు ఆయన సంఘీభావాన్ని తెలిపారు. అదేవిధంగా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్, బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు లక్ష్మీబాయ్, గోపి, సురేష్ తదితరులు నిరసనకారులకు తమ మద్దతు తెలియజేశారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఆలమూరు: కొత్తూరు–వెదురుమూడి రోడ్డులోని పెదపళ్ల వద్ద లారీ ఢీకొని ఈతకోట శ్రీనివాసరావు (45) మృతి చెందాడు. ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కథనం ప్రకారం రావులపాలెం మండలంలోని ఊబలంకకు చెందిన శ్రీనివాసరావు తన వ్యక్తిగత పని మీద అంగర వెళ్లి తన ఎలక్ట్రికల్ స్కూటర్‌పై తిరుగు ప్రయనమయ్యాడు. స్థానిక జోడి చెట్లు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈప్రమాదంలో శ్రీనివాసరావు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు సామాజిక సాధికారత సాధించాలి



కుట్టు మెషీన్ల పంపిణీని ప్రారంభిస్తున్న ఎంపీ అనురాధ, ఓఎన్‌జీసీ ఈడీ అమిత్‌నారాయణ

ఎంపీ చింతా అనురాధ

అల్లవరం: మహిళలు స్వశక్తితో సామాజిక సాధికారత సాధించాలని ఎంపీ చింతా అనురాధ అన్నారు. ఓఎన్‌జీసీ రాజమండ్రి ఏసెట్ సౌజన్యంతో సమకూర్చిన కుట్టుమెషీన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో మండలంలోని పది గ్రామాల్లో 500 మందికి పైగా కుట్టుమెషీన్ల పంపిణీ చేశామన్నారు. అంతేకాకుండా కాకినాడ ఓఎన్‌జీసీ వారిచే 9 ఓహెచ్ఆర్ ట్యాంకులు, రాజోలులో మరో 9 ఓహెచ్ఆర్ ట్యాంకులు నిర్మించామన్నారు. ఒక్క అల్లవరం గ్రామంలోనే ఎంపీ ల్యాండ్స్ నిధులు రూ.85 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రూ.25 కోట్లతో పేరూరు–ఓడలరేవు ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మించామని చెప్పారు. ఓఎన్‌జీసీ ఈడీ అమిత్‌నారాయణ మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో సామాజిక బాధ్యతగా విద్య, వైద్యం, మహిళా సాధికారిత, రూరల్ డెవలప్‌మెంట్‌కు ఖర్చు చేస్తున్నామన్నారు. గోడితిప్ప గ్రామానికి 60 వేల లీటర్ల సామర్ధంతో ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గోడిలంక, తుమ్మలపల్లి, గోడితిప్ప గ్రామాలకు చెందిన 100 మంది మహిళలకు కుట్టుమెషీన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు దాకారపు చిరంజీవి, రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీలు రాజేశ్వరీ, గుబ్బల బాబ్జి, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మాకే కృష్ణమూర్తి, పార్టీ నాయకులు కర్రి శ్రీను, దొమ్మేటి సురేష్, రుద్రరాజు లక్ష్మీపతిరాజు, వేణుగోపాల్, కొప్పాడి వెర్రియ్య, ఓఎన్‌జీసీ అధికారులు రామారావు, సుబ్బరాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి



కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించిన వివిధ పార్టీల నేతలు, అంగన్‌వాడీలు

అమలాపురం రూరల్: అంగన్‌వాడీల ఉద్యమంపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు, జనసేన, కాంగ్రెస్, మహిళా సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, జనసేన పార్లమెంటు నియోజకవర్గ నాయకుడు డీఎంఆర్ శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు అయితాబత్తుల సుభాషిణి, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి, సీఐటీయూ నేత జి.దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడారు. తక్షణం అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డిజిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌పై సెమినార్

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆర్థిక, వాణిజ్య శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో డిజిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఢిల్లీకి చెందిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ బత్తుల శ్రీనివాస్ ముఖ్యవక్తగా మాట్లాడారు. డిజిటల్ సర్వీసెస్ ఉపయోగాలు, వాటి ప్రాముఖ్యం గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలు ఏటీఎం, గూగుల్ పే, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే వీటిని బాగా ఉపయోగించుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు, పద్మనాభం, డాక్టర్ చంద్రబోస్, గోపాలకృష్ణ, సరిత, నల్లి రాజు, భాస్కరరావు, శ్రీరామమూర్తి, రాజ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

అల్లవరం: దేవగుప్తం సబ్‌స్టేషన్ పరిధిలోని దేవగుప్తం, డి.రావులపాలెం, సామంతకుర్రు, ఎస్.పల్లిపాలెం, తూర్పులంక గ్రామాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ రవికుమార్ మంగళవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల కత్తిరింపు పనులు, వార్షిక మరమ్మతుల్లో భాగంగా విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు.

ఆర్ట్ కాంపిటేషన్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

ముమ్మిడివరం: ఇటీవల ముంబై రంగోత్సవ్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహించిన ఆర్ట్ కాంపిటేషన్ పోటీల్లో మండలంలోని మర్లపాలెం ప్రాథమిక పాఠశాలకు చెందిన పి.లక్ష్మీ శ్రావణి ఆర్ట్ మెరిట్‌లో రెండు బంగారు పతకాలు సాధించింది. అలాగే బి.సాత్విక్, పి.మనోజ్, కె.ఎస్తేరు, ఎం.పూర్ణిమ, ఎం.సంజనలు గోల్డ్ మెడల్స్, పి.యామిని, పి.మనోజ్‌లు కాంస్య పతకాలు గెలుచుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బొజ్జా రమణశ్రీ, హెచ్ఎం టీఎల్ఎస్ సుష్మాంజలి, సర్పంచ్ వి.నాగ బ్రహ్మేశ్వరరావు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

చిన్నారుల కవితా గానం



తెలుగు మహా సభల వేదికపై కవితా గానం చేస్తున్న చిన్నారులు కావ్య, కీర్తన

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరంలో జరిగిన ప్రపంచ తెలుగు మహా సభల వేదికపై అమలాపురానికి చెందిన చిన్నారి అక్కాచెల్లెళ్లు ఎస్.కావ్య, కీర్తనలు కవితా గానం చేశారు. కవి సమ్మేళనంలో పాల్గొని 'ఇక్కడ యుద్ధం ఒక జోల పాట' అనే కవితను చిన్నారి కావ్య ఆలపిస్తే... తెలుగు వెలుగుపై కవితా గానాన్ని చిన్నారి కీర్తన వినిపించారు. ప్రపంచ తెలుగు సభల వేదికపై చిన్నారులిద్దరికీ ప్రశంసా పత్రాలు, పతకాలు అందించి సత్కరించారు. అమలాపురం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేస్తున్న కవి ఎస్.సంసోను కుమార్తెలు కావ్య, కీర్తన. చిన్నారి అక్కా చెల్లెళ్లను, వారి తండ్రి సంసోనును పలువురు సాహితీవేత్తలు, కవులు అభినందించారు.

ఎఫ్-3 ఫౌండేషన్ వితరణ



రోడ్డు చెంత నివసించే వృద్ధుడికి భోజనం అందిస్తున్న జానీ

అమలాపురం టౌన్: పట్టణంలోని యాచకులు, రోడ్డు చెంతనే నివసించేవారికి అమలాపురం ఫ్రెండ్స్ ఫర్ ఫీడింగ్(ఎఫ్-3) ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందజేశారు. ద్విచక్రవాహనాలపై తిరుగుతూ ఆకలితో ఉన్నవారందరికీ భోజన ప్యాకెట్లు ఇచ్చారు. రోజూ పది మందికి, ప్రతీ మంగళ, గురువారాల్లో మాత్రం 100 మంది యాచకుల ఆకలి తీరుస్తున్నామని ఎఫ్-3 వ్యవస్థాపక అధ్యక్షుడు పఠాన్ అబ్జానీ(జానీ) తెలిపారు. ఎఫ్-3 ఫౌండేషన్ సేవలను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ నూకరాజు

తాళ్లరేవు: మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి ఆధ్వర్యంలో మంగళవారం పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంతూర్, విప్రో కంపెనీ డిస్ట్రిబ్యూటర్ కంచర్ల గోపి సహకారంతో ముగ్గుల పోటీలు నిర్వహించి సర్పంచ్ వెంటపల్లి నూకరాజు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎండీయూడబ్ల్యూ ప్రతినిధులు దున్నా సుబ్రహ్మణ్యం, మురళి, వి. వెంకట రామకృష్ణ, సాధనాల శివరామకృష్ణ పాల్గొన్నారు.

కేసుల ఎత్తివేత వెనక్కి తీసుకోవాలని వినతి

ఉప్పలగుప్తం: కోనసీమ అల్లర్ల నేపథ్యంలో పెట్టిన కేసులను ఎత్తివేస్తూ ప్రభుత్వం ప్రకటించిన జీవోను వెనక్కి తీసుకోవాలని కోరుతూ మండల మాలమహానాడు నాయకులు మంగళవారం ఎస్.కొత్తపల్లి గ్రామంలో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు కొంకి వెంకట వెంకటబాబ్జి, బాలకృష్ణ, నందిక రమేష్, పండు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



ముమ్మిడివరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: ఈ నెల 19న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ముమ్మిడివరం పార్టీ కార్యాలయంలో టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రఘురామ్‌కు అభినందనలు



రఘురామ్‌ను కలిసి అభినందనలు తెలుపుతున్న ఆక్వా రైతు సంఘాల నాయకులు

కాట్రేనికోన: ఆక్వా పరిశ్రమ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్‌కు కేబినెట్ హోదాను కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆక్వా రైతు సంఘం నాయకులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఆక్వా రైతులు తాడేపల్లిగూడెంలోని ఆయన నివాసంలో రఘురామ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రైతు నాయకులు త్సవటపల్లి నాగభూషణం, గోడి సత్తిబాబు రాజు, కోటిపల్లి ధర్మరాజు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌పై ఉపన్యాస పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

యానాం: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ భారతదేశం-2047 ఉపన్యాస పోటీలను మంగళవారం నిర్వహించారు. పోటీల్లో 40 మంది పాల్గొనగా గొల్లపల్లి కుమార్‌రాజా, మాగాపు దీపిక, నివేత అంగుస్వామి విజేతలుగా నిలిచారు. వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2047 సంవత్సరానికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతున్నందున దేశాన్ని అభివృద్ధి బాటలో పయనింపజేయాలన్నది ప్రధాని మోడీ ఆశయమని కోఆర్డినేటర్ తిర్రి గోపి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణ సుధాకర్, సరెళ్ల కుమార్, ఉపాధ్యాయిని ఓలేటి మహాలక్ష్మి పాల్గొన్నారు.

రెవెన్యూ జేఏసీ చైర్మన్ దంపతులకు సత్కారం



దివాకర్ దంపతులను సత్కరిస్తున్న కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు

అమలాపురం రూరల్: రాజమండ్రిలో జరుగుతున్న అంతర్జాతీయ తెలుగు మహా సభల ముగింపు సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్, కోనసీమ జేఏసీ చైర్మన్ వాసా దివాకర్ దంపతులను ఘనంగా సత్కరించారు. వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి, అమలాపురం డివిజన్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు గీతను కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు సన్మానించారు.

సహస్ర కవితా నీరాజనం



తెలుగు మహాసభల ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న బిందు రాజీ

అమలాపురం రూరల్: అమలాపురానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని వుండపల్లి బిందు రాజీ సహస్ర రాజమహేంద్రవరంలో జరుగుతున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో కవితా సమ్మేళనంలో పాల్గొని శతక పద్యాలను వినిపించింది. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రతిభను అందరూ ప్రశంసించారు. ఎస్‌కేబీఆర్ కళాశాల అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, కోనసీమ క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు డీఎస్ఎన్ రాజు, ఆంధ్ర సారస్వత పరిషత్తు జాతీయ సమన్వయకర్త డాక్టర్ ఎస్ఆర్ఎస్‌కొల్లూరిల చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని విద్యార్థిని బిందు రాజీ సహస్ర అందుకుంది.

గర్భిణులకు వైద్య పరీక్షలు

కాట్రేనికోన: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు నీలిమ ఆధ్వర్యంలో మంగళవారం పీఎంఎస్ఎం పథకంలో భాగంగా సుమారు 46 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో వైద్యురాలు నీలిమ మాట్లాడుతూ గర్భిణులు కచ్చితంగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వైద్యుల సలహాపై వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రమాశేషు, సీహెచ్ఓ శ్రీహరి పాల్గొన్నారు.